# ★ క్షమ ★

శ్రీమతి "చిన్నా"

ఎవరుతల్లీ నీవు ? కన్నీరుకారుస్తూ ? ఎంతకాలమని. అట్లా ? దిగమింగుకోవలసిన దుఃఖమా నీది? పరవాలేదు. నాదగ్గర చెప్పుకోవచ్చు. అభిమానం నోరు పెగలనివ్వదు నిజమే ! నేనూ ఎరుగుదు నీ బాధ. అనుభవించానుగూడా. అనుభవిస్తున్నానింకా. ఇంకా ఎంతకాలం అనుభవిస్తానో చెప్పలేనుకూడా. ఆహా ! చెప్పలేకేం ? బ్రతికినంత కాలమూ అనుభవించవలసిన దుఃఖమునాది. పెదవి దాటి బయటికి రాకూడని దుఃఖం బావురుమని ఏడ్చుటకుగూడా నోచుకోని దుఃఖం. లోకములో ఎన్ని రకముల దుఃఖాలు లేవూ ? అన్నింటిలో ఇదొకటీ ? ఇది అనుభవించేవంతు నాకొచ్చింది. నిజమే ! లోకంలో ఆకలి ఉంది. దానిని అనుభవించేవంతు కొందరికి మాత్రమే. ఆకలి ఏం మహా భాగ్యంకాదు. బాధ. అది ఈ రూపములో 'ఉన్నదనిగాని ఈ దేహం వదలకుండా పోతుందనికాని చెప్పలేం. ఆకలిబాధ చెప్పుకున్నకొలదీ పెరిగిపొయ్యేబాధ. అజీర్ణ రోగులకు పరమ ఔషధము ఈ బాధ. అమ్మా ఆకలి యని అరచి చెప్పుకోవచ్చును ఆకలిబాధ. అంత దారుణమైన ఆకలిబాధలో కూడా కొన్ని సుగుణాలు ఉన్నవి. మరి నే పడే బాధకు ఏమైనా తప్పించుకొనే రహదారులు ఉండపోతాయా ? అని నాలుగు దిక్కులా వెదికాను. వెదుకుతున్నాను. నేను ఆశా జీవిని ప్రాణమున్నంత వరకూ వెతుకుతూనే ఉంటాను. అప్పుడప్పు డనిపిస్తుంది. ఈ వెదుకుటయే నా బాధ మరచిపోడానికి ఓపెద్ద రహదారి యేమో ! అమ్మా ! దుఃఖంతో బరువెక్కిన నీ కనురెప్పలు పైకెత్తటానికి ప్రయత్నించుతల్లీ ! నిన్నేమని పిలవను ? చెల్లీ అని నోరారా పిలుచుకోవాలనుంది. మనం యిద్దరము ఒకమాదిరి దుఃఖసముద్రం ఈదుతున్నాం, లేదు కొట్టుకుంటున్నాం. అది సరిగాదు. నేను మాత్రం కొట్టుకుంటున్నాను. నీవు కదలుటయేలేదు. అలాంటిప్రయత్నమైనా చేయటంలేదు నీవు. ఎవరునీవు ? ఎందుకిట్లా ? అయ్యో ! క్షమించు ! తల్లీ ! తెలివితక్కువ ప్రశ్న వేస్తున్నందుకు క్షమిస్తావుకదూ ! క్షమాదేవివి నీవు. నీకీపేరు ఎంతో తగివుంది. నిన్ను ఈపేరుతోనే పిలుస్తాను. క్షమాదేవీ ! నా మాట విను. చేతనా సహజమగు ప్రకృతిలో పుట్టాం. నదులూ, పర్వతాలూ, అరణ్యాలూ, పట్టణాలూ, మానవులూ, జంతువులు పక్షులు క్రిమికీటకాలు సమస్తమూ చలనముగలిగి ఉన్నవి. దుఃఖానికీ చలనముండదు ! ఉంటుంది. తప్పక ఉంటుంది. తల్లీ ఎంతకూ మాట్లాడవు. నీకు నమ్మకము లేదుకదూ. నిజం చెపుతున్నాను. నాకు మాత్రం నమ్మిక ఎక్కడుందీ ? లోకానికి మార్పు సహజము. నేను ఆశాజీవిని. అందుకని చెపుతున్నాను. ఇంతటి దుఃఖానికీ అంతం ఉండవచ్చును తల్లీ. ఎప్పుడూ ? ఎలాగ ? "బ్రతుకులు ముగిసినప్పుడు మిగిలిన శూన్యంలా" ఆఁ ఆఁ ఏమిటీ ? మీరే అంటున్నారా ఈమాటలు ? కాదు. కాదు. మీరు కదలనైనాలేదు. నేనే. నాలోంచే ఈమాటలు ! ఆశాజీవిలోంచే ఈమాటలు ! ఎంతటి నిరాశ ఈ మాటల్లో ! ఒంటిరితనంలోని స్తబ్దత్వం ఈ మాటల్లో గూడుకట్టింది. అమ్మా ! అమ్మా ! ఇటుచూడు తల్లీ ! క్షమించుచెల్లీ ! సర్వత్రా చైతన్యము. ఆరాధించేనేను. రాయిలా నల్లరాయిలా. అంతకన్నా కఠినంగా నిరాశగా ఇట్లా అయ్యానని ఇంత వరకూ నాకు తెలియనేలేదు. క్షమాదేవీ ! నీవుసాక్షాత్తు క్షమాదేవివి. కేవలము స్త్రీవి. పతిగతప్రాణానివి. భారత మాతకు పుత్రివి. అబలవు. నీపతిబలమును నమ్మి బ్రతుకుచానవు. హిందూ స్త్రీవి. స్త్రీ అంటే శక్తిస్వరూప మనే ఇదివరకు తెలుసుకున్నాను. క్షమామూర్తులు స్త్రీలే అని ఇప్పుడు తెలిసింది. క్షమాదేవీ ! నీ భర్తను, నీ ప్రాణాన్ని, నీప్రాణాధికాన్ని పరస్త్రీలకప్పగించి పెదవి మెదపకుండా దుఃఖం తెలియనీయకుండా నిశ్శబ్దంగా ఊపిరి పీలుస్తూ దినాలు వెళ్ళదీయగలశక్తి ఎవరిచ్చారమ్మా నీకు ? స్త్రీ శక్తి రూపిణి. ఈ శక్తి నీదే అంటున్నావా ? తల్లీ ! ఏ ఆశా లేకుండానే బ్రతుకెట్లా నిలుపుకోగలుగుతున్నావు తల్లీ ! ఏమిటీ యోచిస్తున్నావు. ఏమో అనుకుంటున్నావు. అంతా ఒక్కతృటి. కదలబోయి ఆగిపోయింది తల్లి ! దుఃఖంలో మరగిపోతున్నది. పొంగురాకుండా ఆపాలంటే తరమా ! ఎప్పుడో పొంగిపోతుంది తప్పదు. ఎప్పుడో ఏమిటీ ? ఇప్పుడేనేమో !

తల్లీ ! తల్లీ ! ఏమిటి ఇదంతా ఈ ఎరుపులు ఈ రక్తవర్ణము ఎక్కడినుంచి లోకమంతా జీవలోకమంతా నిండి ఇంకా ఎక్కడికో దూసుకుపోతున్నది. తెల్లని స్ఫటికములాంటి నీ దేహము రక్తము చిందుతున్నది,


మల్లెపూవుల మరిపించే సుకుమార ధావళ్యమైన నీతనువు కాలుతున్న ఇనుములా మారుతున్నదేమితల్లీ. క్షమాదేవీ! నీవేనా ఇదంతా. ఏమిటో అంటున్నావు. "స్త్రీలు, ముఖ్యంగా ఒకే భర్తతో బ్రతుకదలచుకొన్న స్త్రీలు, విశేషంగా భారతదేశంలో, భర్త చాటున మనదలచిన స్త్రీలు, క్షమాదేవులు కాకతప్పదు. అంటున్నావా? తల్లీ! లేదు నీవేమీ అనడంలేదు. ఈమాటలుకూడా నాలోనించే వినపడుతున్నాయి. నిజం నీలో కనపడుతున్నది. నా లోంచి వినబడుతున్నది. అంతేనా! నిజం అంతేనా! కన్నతల్లీ, క్షమాదేవీ నామాట మన్నించుతల్లీ! దుఃఖంలో బరువెక్కిన, కాగికాగి ఎరుపెక్కిన నీ కన్నులొకసారి నావంక ఎత్తిచూడు తల్లీ! తల్లి ఏమో అంటున్నది! చూసి చేసేదేమీ లేదనా! క్షమాదేవీ ఏమో అంటున్నావు నీవే! ఈమాటలు తప్పక నీవు మాత్రమే అనగలిగిన మాటలు స్త్రీలలో! ఏమిటీ అంటున్నావు? లోకంకోసం, నీతోడి స్త్రీలోకంకోసం. కాదు కాదు. అనాథలయొక్క అత్యాశాపరులయొక్క స్వార్థంకోసం కులస్త్రీలు ధనం, ప్రాణం, నవ్వుతూ అర్పించాలా? అందుకని క్షమాదేవతని ఆశ్రయించారా? కులస్త్రీలంతా? క్షమా దేవతలు! ఇదే నీ జవాబా తల్లీ? ఇదే నీ సందేశమా మాకు తల్లీ! తల్లీ! శిల అరిగినట్లు, లోహం కరిగినట్లు కఠినంగా మారిన నీ దేహం మళ్ళీ కరిగిపోతున్నదితల్లీ! ఎరుపెక్కిన నీతనూకాంతిలో నీలిరంగులెక్కడినుంచో! పురుషుల్లో ప్రాధాన్యంలేదా? జగాన్ని భుజాలమోయు పురుషులకు అంగరక్షకై నిలచినవారికి సగం ప్రపంచం నిండినవారికీ నీ కటాక్షమిస్తున్నావా తల్లీ!

ఆఁ నీవన్నది సరిగా వినబడలేదే. కులసతులందో, పరసతులందో, పడుపువృత్తితో పొట్టపోసుకొను పణ్య స్త్రీలయందో, ధనమూ, బలమూ ధారపోయుటయే పురుషుల పుట్టుక ఫలమంటావా? సత్యం ఇంతేనాతల్లీ! ప్రత్యేకత పురుష జన్మలది కానేకాదా? తల్లీ! తల్లీ! ఏమైపోతివితల్లీ. ఎందును కనపడవేమో తల్లీ! కరిగిపోయి కరిగిపోయి అరుణోదయంలో కలిసిపోతివా క్షమా ధరిత్రీ! నేనూ, ఆశా, చిరంజీవులమా!




మీ బిడ్డ మామూలుగా భుజించనిచో


మందంగా వుండి, పొట్ట ఉబ్బివున్నచో, బహుశా కడుపులో బల్ల (లివర్) పెరుగుతుండవచ్చు. యీ లివర్ వ్యాధి సాధారణముగా 3 సంవత్సరాలలోపు పిల్లలకు వచ్చుట సహజము.




జమ్మి వారి

లివర్‌క్యూర్

లివర్ & స్ప్లీన్ వ్యాధుల చికిత్సకు, నివారణకు.




ఇప్పుడు మాత్రం రూపంలో లభిస్తున్నది.

జమ్మి వెంకటరమణయ్యా అండ్ సన్స్,
'జమ్మి బిల్డింగ్స్', మైలాపూర్, మద్రాసు.
శాఖ: వొరుగంటివారి వీథి, విజయనగరం సిటీ, మరియు ఇతర స్థలములలో.